# జేఎన్‌టీయూ కాలేజీలకు సొంత భవనాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భవనాల నిర్మాణానికి ముహూర్తాలు ఖరారయ్యాయి. వనపర్తి జేఎన్‌టీయూ కాలేజీ భవన నిర్మాణానికి వర్సిటీ అధికారులు ఈనెల 13న (మంగళవారం) శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, ఖమ్మం జిల్లాలోని పాలేరు జేఎన్‌టీయూ కాలేజీ భవన సముదాయాలకు ఈనెల 18న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలేరు కాలేజీకి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసింది.

# ఎప్‌సెట్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్

- పరిశీలనలో మరో విడత మాక్ కౌన్సెలింగ్
- డిగ్రీ ఇంటర్న్‌షిప్, స్టైపెండ్
- డిగ్రీ కోర్సుల్లో 50% అమ్మాయిలే
- 'నమస్తే తెలంగాణ'తో ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : ఎప్‌సెట్ సహా అన్ని రకాల ప్రవేశ పరీక్షల హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించనున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల అడ్రస్‌ను విద్యార్థులు సులభంగా తెలుసుకునేందుకు క్యూఆర్‌కోడ్ ముద్రిస్తున్నామని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, లా, ఎంబీఏ, ఎంసీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియను ఉన్నత విద్యామండలి ఇటీవలే ప్రారంభించింది. ప్రవేశ పరీక్షలు నిర్వహించే వర్సిటీలను ఖరారుచేయడమే కాకుండా కన్వీనర్లను సైతం నియమించింది. పరీక్షల షెడ్యూల్‌ను సైతం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో బాలకిష్టారెడ్డి ఆదివారం 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు. ఎప్‌సెట్ వెబ్‌కౌన్సెలింగ్‌లో ఈ ఏడాది మరో విడత కౌన్సెలింగ్‌ను జోడించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు ఫిబ్రవరిలో విడుదల చేస్తామని వెల్లడించారు. డిగ్రీ కోర్సుల్లో 50% అమ్మాయిలే ఉన్నట్టు పేర్కొన్నారు. దోస్త్‌లో 2,05,140 మంది చేరితే, వీరిలో 1,08,941 మంది అమ్మాయిలే ఉన్నట్టు తెలిపారు. అన్ని వర్సిటీల్లో కామన్ క్రెడిట్ విధానం అమలుకు నిర్ణయించి, డిగ్రీ క్రెడిట్లను 142గా ఖరారు చేశామని తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌తోపాటు స్టైపెండ్‌ను కూడా అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు నైపుణ్యాలు కల్పించడం కోసం నాస్కామ్ తో, ఫార్మా పరిశ్రమల్లో అవకాశాల కల్పనకు బల్క్‌డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్‌తో, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ కోసం టీశాట్ సంస్థతో, విద్య సహకారం, ఉపాధి, ఆవిష్కరణల కోసం యూనివర్సిటీ ఆఫ్ శాన్‌డియాగోతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు.